టెట్‌కు వేళాయె..

ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాల్లో ఏర్పాట్లు

రేపటి నుంచే పరీక్షలు

ఈనాడు – అమరావతి

గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క డీఎస్సీ పరీక్షనూ నిర్వహించలేదు. ఉపాధ్యాయ కొలువుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. తెదేపా కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా తొలుత టెట్ ఆపై డీఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకుంది. 16 వేల పైచిలుకు పోస్టుల భర్తీకి ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం గురువారం నుంచి ఈ నెల 21 వరకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) జరగనుంది. ఇందుకోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 8 కేంద్రాల్లో 30 వేలమంది అభ్యర్థులకు తగ్గట్టుగా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం టీసీఎస్‌కు అప్పగించింది. పరీక్ష సమయంలో విద్యుత్తు అంతరాయం, కంప్యూటర్లు మొరాయించడం వంటి అంతరాయాల్లేని కళాశాలల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లకు వారి మెథడాలజీని అనుసరించి వివిధ తేదీల్లో పరీక్ష నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అభ్యర్థుల సొంత జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించలేదు.



గుంటూరు జిల్లాలో పరీక్ష కేంద్రాల వివరాలు

సెంటర్ కోడ్	కేంద్రం పేరు	పూర్తి చిరునామా
7996	ఐయాన్ డిజిటల్ జోన్, పేరేచర్ల	యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, డోకిపర్రు, నియర్ పేరేచర్ల, నరసరావుపేట రోడ్, మేడికొండూరు మండలం
8891	మలినేని పెరుమాళ్లు ఎడ్యుకేషనల్ సొసైటీస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్	పుల్లడిగుంట, ప్రత్తిపాడు మెయిన్‌రోడ్, వట్టిచెరుకూరు మండలం
9651	ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్	ఐదవ మైలు, కొర్నెపాడు, ప్రత్తిపాడు మెయిన్ రోడ్, వట్టిచెరుకూరు మండలం
30318	బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	బ్లాకు–బి, చల్లావారిపాలెం, నల్లపాడు రోడ్, గుంటూరు

పల్నాడు జిల్లాలో....

1229	నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ	కోటప్పకొండరోడ్, యల్లమంద, నరసరావుపేట
9652	మామ్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీ	కేశానుపల్లి, నరసరావుపేట మండలం,
8890	నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ అటానమస్‌బ్లాకు–4	కోటప్పకొండరోడ్, యల్లమంద, నరసరావుపేట మండలం
9136	ఎ.ఎంరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ	వినుకొండ రోడ్, అట్లూరి మస్తాన్‌రెడ్డి నగర్, పెట్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం

ఇందులో అర్హత సాధిస్తేనే

టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాయడానికి వీలవుతుంది. ఇప్పటికే అభ్యర్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో పెట్టారు. వీటిల్లో ఆయా పరీక్ష కేంద్రాల పూర్తి చిరునామాలు పేర్కొన్నారు. వాటిని సులభంగా చేరుకోవచ్చని విద్యాశాఖవర్గాలు తెలిపాయి. బాపట్ల జిల్లాలో పరీక్ష కేంద్రాల్లేవు.

ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు కారంపూడిలోని బ్రహ్మనాయుడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనితశివను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అందుబాటులో ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

అమృత్.. ఆలస్యం!

ఇంకా సిద్ధంకాని డీపీఆర్‌లు

ఈనాడు – అమరావతి

అమృత్ - 2 పథకం ప్రాజెక్టు సవివర పథక నివేదికలు (డీపీఆర్) ఇంతవరకు సిద్ధం కాలేదు. నగర, పురపాలక సంఘాల్లో ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు కేంద్రం ఈ పథకం కింద నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే డీపీఆర్‌లు పంపిన వాటికి నిధులు విడుదలై టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రెండో దశలో తాగునీటికి రూ. 309.64 కోట్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు రూ. 203.94 కోట్లు మంజూరయ్యాయి. డీపీఆర్‌లు ఆమోదం పొందాకే ఈ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా తాగునీరు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు మంజూరైన నిధులు

జిల్లా	నీటి సరఫరాకు	ఎస్‌టీపీ
	(అంకెలు కోట్ల రూపాయాల్లో)	
గుంటూరు	47.14	110.81
పల్నాడు	182.42	93.13
బాపట్ల	80.08	0
మొత్తం	309.64	203.94

ఎందుకో జాప్యం!

డీపీఆర్‌ల ప్రతిపాదనలు కోరి ఇప్పటికే చాలా రోజులైనా ఇంజినీరింగ్‌వర్గాలు సిద్ధం చేయలేదు. దీంతో నేరుగా పురపాలకశాఖ ఉన్నతాధికారులే ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఫోన్‌లో మాట్లాడి గట్టిగా ప్రశ్నించడంతో వారిలో చలనం వచ్చింది. కేంద్రం నిధులిస్తామన్నా.. వినియోగించడానికి అభ్యంతరమేమిటి? డీపీఆర్‌ల తయారీకి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. మొదటి దశలో ఎంపికైన గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేటల్లో తాగునీటి పథకాల నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా ఉన్నాయి. కారణం.. వాటి నిధులను సక్రమంగా వినియోగించకుండా మున్సిపాల్టీల అధికారులు ఇతరత్రా పనులకు వెచ్చించడమే.



చిలకలూరిపేట పట్టణ శివారు వాగు ఒడ్డున నిలిచిన మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం

ఎమ్మెల్యేల అభిప్రాయాలతో

ఎక్కడెక్కడ తాగునీటి రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు, ఫిల్టరేషన్ ప్లాంట్లు నిర్మించాలి? ఎంత ఖర్చవుతుంది? ఎన్ని మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు? వాటి పరిధిలోని జనాభా ఎంత? వంటి వివరాలను డీపీఆర్‌లో పొందుపరచాలి. పట్టణాల్లో వెలువడే మురుగునీటి కోసం మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (ఎస్‌టీపీ) నిర్మించి ఇక్కడ శుద్ధి చేశాకే కాలువల్లోకి వదిలేలా అమృత్-2లో ప్రతిపాదించారు. ఆయా పట్టణాల్లో ఎన్ని ఎస్‌టీపీలు అవసరం? ఎన్ని లీటర్ల నీటిని శుద్ధి చేస్తారు? ఎంత సామర్థ్యంతో ప్లాంట్లు కావాలో డీపీఆర్‌లో నివేదించాలని నెల క్రితమే ఆదేశించినా ఇప్పటికీ మున్సిపాల్టీలు స్పందించలేదు. ఉద్యోగుల బదిలీలలో డీపీఆర్‌ల తయారీలో జాప్యం చోటుచేసుకుందని ఇంజినీరింగ్‌వర్గాలు చెబుతున్నాయి.

నాలుగైదు రోజుల్లో సిద్ధం చేస్తాం

గతంలోనే డీపీఆర్‌లు సిద్ధం చేశాం. ఎమ్మెల్యేలు మారినందున కొత్తవారి అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంది. రిజర్వాయర్లు, ఎస్‌టీపీల నిర్మాణాలకు ఏమైనా సూచనలు చేస్తే వాటిని కచ్చితంగా పొందుపరచాల్సి ఉంది. అందుకే వారందరి అభిప్రాయాలు తీసుకుని నాలుగైదు రోజుల్లో డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపుతాం.

– ప్రజారోగ్య ఇంజినీరింగ్‌వర్గాలు

అమృత్ రెండో దశకు ఎంపికైన పట్టణాలు: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, పొన్నూరు, రేపల్లె, బాపట్ల, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ.

❖ మొదటి దశకు ఎంపికైన గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేటల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఒక్క గుంటూరు నగరంలోనే 20 వేలకు పైగా కనెక్షన్లు ఇచ్చారు.



వీక్షణ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులు

నిర్ణీత గడువులోగా ఓటర్ల జాబితాల సవరణ: కలెక్టర్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రత్యేక సారాంశ సవరణ 2025, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఓటర్ల జాబితాలు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో వినాయకం పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ముద్రణ ఈ నెల 29న చేస్తామన్నారు. అభ్యంతరాల స్వీకరణకు నవంబరు 28 వరకు గడువు ఉంటుందన్నారు. 2025 జనవరి 1న తుది జాబితా ప్రచురణ ఉంటుందని వివరించారు. జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే ఇప్పటికే 99.90 శాతం పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో క్లెయిమ్‌లు 7139, మృతి చెందిన వారు 5620 ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్డీవోలు మధులత, రమణాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ, ఆర్వోలు శ్రీరాములు, వరద సుబ్బారావు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించం

గుంటూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల మూడు నుంచి 21 తారీఖు వరకు జరగనున్న ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 18,476 మంది హాజరుకానున్నారని డీఈవో శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు కేంద్రాల్లో పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఉదయం సెషన్ పరీక్ష 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ పరీక్ష 2.30 గంటలకు ఉంటుందని తెలిపారు. పరీక్ష నిర్దేశిత సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, చరవాణిలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లుతో పాటు ఆధార్ గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని సూచించారు.

రైల్వే గేటు మూసివేత

గుంటూరు, న్యూస్‌టుడే: అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సి ఉన్నందున నల్లపాడు-బండారుపల్లి మధ్య ఉన్న రైల్వే గేటు(7)ను ఈనెల 2వ తేదీ ఉదయం 6 నుంచి 3వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసివేస్తున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు.

గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు నోటీసులు

గుంటూరు, న్యూస్‌టుడే: పర్యావరణ అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నందుకు గుంటూరులోని గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు తీసుకున్న నవీనా బేగం గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ల సముదాయాలను ఇటీవల పరిశీలించారు. పూర్తి స్థాయిలో పర్యావరణ అనుమతులు తీసుకోకుండా 20,000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తున్న భవనాలకు పర్యావరణ అనుమతులు అవసరం కాగా.. నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో అనుమతులు పొందలేదని గుర్తించారు. 2015లో ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో అనుమతులు తీసుకొని ఏలూరు జూట్ మిల్స్ లిమిటెడ్ పేరుపై మార్చుకున్నారు. 20,000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో తలపెట్టిన భవన నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన సీటీఈని ఏపీపీసీబీ నుంచి పొందలేదు. బోర్డు సమ్మతి పొందకుండానే నివాస సముదాయాలను నిర్మించడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. దీంతో షోకాజ్ నోటీసు అందించడంతో పాటు 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని, అప్పటి వరకు నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశించారు.

జిల్లాలో 129 మద్యం దుకాణాలు

➻ లైసెన్స్‌ల జారీకి నోటిఫికేషన్ విడుదల ➻ జనాభా ఆధారంగా ఫీజు ఖరారు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

జిల్లాలో 129 మద్యం దుకాణాలకు లైసెన్స్‌ల జారీకి మంగళవారం ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం మంగళవారం నుంచే దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కల్పించారు. ఒక్కో దరఖాస్తుకు రూ. రెండు లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుము చెల్లించాలి. ఒకే వ్యక్తి ఒక దుకాణం లేదా వేర్వేరు దుకాణాలకు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నరసరావుపేట టౌన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో వచ్చిన దరఖాస్తుల నుంచి ఈనెల 11న లాటరీ తీసి లైసెన్స్‌లు కేటాయించనున్నారు. లైసెన్స్ దక్కించుకున్న వారు నిర్దేశిత రుసుములో తొలి వాయిదాను 24 గంటల్లోగా ప్రభుత్వానికి చెల్లించాలి. 12 నుంచి లైసెన్స్‌దారులు కొత్త దుకాణాలు ప్రారంభించాల్సి ఉంది. 2011 జనాభా ఆధారంగా ఏడాదికి లైసెన్స్ రుసుం నిర్ణయించారు. ఈ ఏడాది రిటైల్ ఎక్సైజ్ పన్ను కింద పది వేల లోపు జనాభాకు లైసెన్స్ ఫీజు రూ. 50 లక్షలు, జనాభా 10 వేల నుంచి 50 వేల లోపు ఉన్న ప్రాంతాల్లో రూ. 55 లక్షలు, 50 వేల పైనుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 65 లక్షలు, 5 లక్షల పైన జనాభాకు రూ. 85 లక్షల ఫీజు చెల్లించాలని నిర్ణయించారు. పట్టణం, మండలం యూనిట్‌గా దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. లైసెన్స్ దక్కించుకున్నవారు ఎక్కడైనా మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం కల్పిస్తారు. లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారుడికి రెండేళ్ల చొప్పున లైసెన్స్ జారీ చేస్తారు.



❖ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: మంగళవారం నుంచి

❖ దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు: ఈ నెల 9 వరకు

❖ లాటరీ తీసి లైసెన్స్‌లు ఖరారు చేసేది: ఈనెల 11

❖ అనుమతులు పొందిన వారు దుకాణాలు ప్రారంభించే తేదీ: ఈ నెల 12

పారదర్శకంగా నూతన మద్యం విధానం అమలు: ఈఎస్

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేయడంలో భాగంగా ఈ నెల 1 నుంచి 9వ తేది సాయంత్రం వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించినట్లు మద్య నిషేధం, అబ్కారీ శాఖ జిల్లా అధికారి (ఈఎస్) మణికంఠ తెలిపారు. నరసరావుపేట అబ్కారీ శాఖ జిల్లా కార్యాలయంలో పల్నాడులోని 129 ప్రైవేటు మద్యం దుకాణాలకు గెజిట్ నోటిఫికేషన్ మంగళవారం ఆయన జారీ చేశారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ. https:// hpsproject.com వెబ్‌సైట్ ద్వారా ఐడీ ప్రూఫ్, పేరు వివరాలతో పాటు ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని 10 అబ్కారీ శాఖ స్టేషన్లలో కూడా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి తమ సిబ్బంది ఆన్‌లైన్ చేస్తారన్నారు. ఈనెల 11 ఉదయం 8 గంటలకు నరసరావుపేట టౌన్‌హాల్‌లో జిల్లా పాలనాధికారి, ఉన్నతాధికారులు, దరఖాస్తుదారులు, ప్రజల సమక్షంలో లాటరీ తీసి దుకాణాలను కేటాయిస్తామన్నారు. సమావేశంలో ఏఈఎస్ కె. రవీంద్ర, నరసరావుపేట సీఐ సోమయ్య, ఈఎస్‌టీఎఫ్ సీఐలు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఎస్ మణికంఠ

పట్టణాల వారీగా దుకాణాల ఏర్పాటు ఇలా..

జిల్లాలోని ఆరు పురపాలక సంఘాలకు 32, రెండు నగర పంచాయతీలకు 8, 28 మండలాలకు 89 వంతున దుకాణాలు కేటాయించారు. నరసరావుపేట పట్టణంలో 7, చిలకలూరిపేట పట్టణంలో 6, సత్తెనపల్లి పట్టణం 6, వినుకొండ పట్టణంలో 6, పిడుగురాళ్ల పట్టణంలో 4, మాచర్ల పట్టణంలో 3, దాచేపల్లి నగర పంచాయతీలో 4, గురజాల నగర పంచాయతీలో 4 దుకాణాలున్నాయి. నరసరావుపేట గ్రామీణ మండలంలో 6, అమరావతిలో 5, నాదెండ్లలో 5, సత్తెనపల్లి గ్రామీణ మండలంలో 5, పెదకూరపాడులో 5, అచ్చంపేటలో 4, క్రోసూరులో 4, నకరికల్లులో 4, రొంపిచర్లలో 4, బొల్లాపల్లిలో 3, చిలకలూరిపేట గ్రామీణ మండలంలో 3, యడ్లపాడులో 3, గురజాల గ్రామీణ మండలంలో 3, కారంపూడిలో 3, వెల్దుర్తిలో 3, నూజండ్లలో 3, పిడుగురాళ్ల గ్రామీణ మండలంలో 3, వినుకొండ గ్రామీణ మండలంలో 3, మాచర్ల గ్రామీణ మండలంలో 2, దాచేపల్లి గ్రామీణ మండలంలో 2, దుర్గిలో 2, బెల్లంకొండలో 2, ముప్పాళ్లలో 2, రాజుపాలెంలో 2, రెంటచింతలలో 2, మాచవరంలో 2, శావల్యాపురంలో 2, ఈపూరులో 2 దుకాణాలను కేటాయించారు.

గాంధీ మాట.. భవితకు బాట



నేడు గాంధీ జయంతి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

గ్రామ స్వరాజ్యం, పరిశుభ్రత, పచ్చదనం, చేనేతకు ప్రోత్సాహం, మద్యపాన నిషేధం.. గాంధీ జయంతి అంటే ఠక్కున గుర్తుకొచ్చేవి ఇవే. అహింసతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత మహాత్మాగాంధీ 'దేశ ప్రజలు ఎలా నడుచుకోవాలి.. దేశం ఏయే రంగాల్లో ముందుకు వెళ్లాలి.. ప్రజల జీవన విధానం, ఆరోగ్యం బాగు కోసం ఎలాంటి వాతావరణం' కావాలనే విషయాలను ఎప్పుడో చెప్పారు. ఆయన మాటలు.. భవితకు బాటలు. వాటిని అనుసరించడం ద్వారా మహాత్ముడు కోరుకున్న గ్రామాల్ని చూడవచ్చు. ఆ దిశగా నేటి ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది.


■ గ్రామ స్వరాజ్యం సాధిద్దాం
■ దేశ ప్రగతికి బాటలు వేద్దాం

దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుల నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి – గాంధీజీ



'అహింసే మన ఆయుధం. దీంతోనే నిజమైన స్వాతంత్ర్యం. అహింస, శాంతితో సాధించే ప్రగతి స్థిరమైంది.' : మాచర్ల మండలం లింగాపురానికి ఓ ప్రత్యేకత ఉంది. అహింస, శాంతి మార్గంలో ఆ గ్రామం పయనిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 2013లో అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోస్ వివాదరహిత గ్రామంగా గుర్తింపు ఇచ్చారు. న్యాయమూర్తులు లింగాపురాన్ని సందర్శించి గ్రామస్థుల ఆదర్శ జీవనయానం, ఐక్యతను అభినందించారు. అలాగే ముప్పాళ్ల మండలం నార్నెపాడు కక్షలు, కార్పణ్యాలతో ఒకప్పుడు అట్టుడికేది. హింసతో తాము నష్టపోతున్న తీరును పెద్దలు గుర్తించి అందరూ ఒక్కటయ్యారు. సమష్టిగా గ్రామాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసుకున్నారు. ఫ్యాక్షన్‌తో పంటలు కూడా పండించలేని స్థితి నుంచి ఇప్పుడు గులాబీ వనాలతోపాటు వినూత్న పంటల సాగుకు ఆ పల్లె వేదిక అవుతోంది. ఇలాంటి గ్రామాలే నేటితరానికి కావాలి.

'చేనేత, ఖాదీ ఉత్పత్తులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు.. వాటిని ఆదరించి, వినియోగాన్ని పెంచాలి. స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యమివ్వాలి'. చేనేతను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ఆరంభించింది. గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వంలో జనతా వస్త్రాల పేరిట చేనేత వస్త్రాలను అల్పాదాయ కుటుంబాలకు అందజేసి ప్రోత్సహించారు. ప్రభుత్వ ఉద్యోగులు చేనేత ఉత్పత్తులు ధరించి కార్మికులకు అండగా నిలిచారు. మళ్లీ ఆ పరిస్థితిని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. సత్తెనపల్లిలోని ఫణిదం చేనేత సొసైటీ ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గుర్తింపు ఉంది. పెదకూరపాడు, దాచేపల్లి, గురజాల, మాచర్లలోనూ చేనేత కార్మికులు ఉన్నారు. వారిని ప్రోత్సహించి మన దేశ ఆత్మను సగౌరవంగా నిలిపేలా మన చేతలు ఉండాలి.



'నా దృష్టిలో కన్నతల్లి కంటే కన్న ఊరు ఎంతో గొప్పది. దేశానికి పల్లెసీమలే జీవనాడి. వాటి అభివృద్ధిపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది.' : గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల దత్తతకు పిలుపు ఇచ్చిన తర్వాత జిల్లాలోని చాలా గ్రామాల పరిస్థితిలో మార్పు వచ్చింది. పల్లెల వైపు ప్రముఖులతోపాటు అందరి చూపు పడింది. దత్తతతో గ్రామాలు అభివృద్ధిబాట పట్టాయి. గ్రామ స్వరాజ్యం సాకారానికి కేరళ బాటను మన పల్లెలు పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పచ్చదనం పెంచడంలో అందరూ భాగస్వాములు కావాలి. పల్లెలు పచ్చదనపు మల్లెలుగా మార్చాలి. మద్యపాన నిషేధం అమలు నిర్ణయాల్ని పంచాయతీలే తీసుకుని అమలు చేయాలి. ఇప్పటికే ఆ దిశగా అడుగులు వేసిన పల్లెల్ని ఆదర్శంగా తీసుకోవాలి.

'వ్యక్తిగత శుభ్రత ఎంతో.. పరిసరాల శుభ్రత అంతకు మించి.. స్వచ్ఛత, పరిశుభ్రతలోనే అభివృద్ధి, ఆరోగ్యం ఇమిడి ఉంది. దీంతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి ముడిపడి ఉంది'. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో గడిచిన 70 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో పెద్దఎత్తున వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. బహిరంగ మల విసర్జన దురాచారం కట్టడికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఐదేళ్ల క్రితం పల్లెల్లో 3.5 లక్షల మేర మరుగుదొడ్లు నిర్మించారు. నాడు ఉమ్మడి జిల్లాలో 1021 పంచాయతీలను బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించారు. సత్తెనపల్లి మండలం నందిగామ సంపద తయారీ కేంద్రం రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని పంచాయతీలు, వివిధ దేశాలకు స్ఫూర్తి నింపుతోంది. ఇలాంటి కేంద్రాలు మరిన్ని ఏర్పాటవ్వాలి. గతంలో అచ్చంపేటలో ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత ఐదేళ్లలో శుభ్రతకు సంబంధించి మెరుపులు మాయమయ్యాయి. స్వచ్ఛతలో జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డుల్ని గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు కైవసం చేసుకున్న పాత రోజులు మళ్లీ రావాలి.






విద్యార్థిని తల్లిదండ్రులకు సాయం అందిస్తున్న హిమాలయ గురూజీ, దాత

పేదరికంతో చదువు మధ్యలో ఆపకూడదు

వినుకొండ రూరల్: ప్రతిభ ఉన్న విద్యార్థులు చదువు మధ్యలో ఆపకూడదని హిమాలయ గురూజీ అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లకు చెందిన కనుగుల పూజిత చదువులో ముందుండేది. వైద్య విద్య చదవాలని ఆశించింది. కానీ పేద కుటుంబం కావడంతో సహకరించలేదు. విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు రెండేళ్లుగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. కళాశాల ఫీజుతో పాటు వసతికి అవసరమైన ప్రతినెలా రూ.7 వేల చొప్పున దాత కన్నెగండ్ల కోటేశ్వరరావు సువర్చలాదేవి దంపతులు అందిస్తున్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు రెండో ఏడాది ఫీజును మంగళవారం హిమాలయ గురూజీ చేతుల మీదగా అందజేశారు. మొదటి ఏడాది ఫలితాల్లో పూజిత ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు.

డీజే శబ్దం.. మనమూ నిషేధిద్దాం!

❖ తప్పుతున్న గుండె లయ ❖ పలు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం

❖ ఇటీవల వినాయక చవితి పండగ, నిమజ్జన ఉత్సవాల్లో భాగంగా పోటాపోటీగా డీజేలు ఏర్పాటు చేశారు. అధిక శబ్దంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సత్తెనపల్లి పట్టణం వడ్డవల్లిలోని ఓ ఇంట్లో డీజే శబ్దానికి గాజు అద్దాల్లో ఉంచిన వస్తువులు కింద పడి పగిలిపోయాయి. మూగజీవాల ఆర్తనాదాలు వాటి యజమానులను ఆందోళనకు గురిచేశాయి.

❖ నరసరావుపేట పట్టణం వరవకట్టకు చెందిన యువకుడు డీజే శబ్దాలు ఎక్కడుంటే అక్కడ ఉండేవాడు. డీజే పాటలకు నృత్యాలతో సందడి చేయడం అలవాటుగా మారింది. ఈ క్రమంలో కొంతకాలానికి అతడికి వినికిడి సమస్య వచ్చింది. ఆసుపత్రికి తీసుకెళ్లి ఈఎన్‌టీ వైద్యుడికి చూపిస్తే డీజే శబ్దాలతో అతడికి చెవుడు వచ్చిందని చెప్పారు.

❖ కొన్ని రోజుల కిందట సత్తెనపల్లి పట్టణంలో ఓ వివాహ వేడుకకు రెండ్రోజులపాటు డీజే ఏర్పాటు చేశారు. ఇంట్లో గుండె సంబంధిత సమస్యతో బాధపడే వృద్ధుడు ఉన్నా పట్టించుకోలేదు. భారీ శబ్దాలకు ఆ వృద్ధుడికి గుండె స్పందనల్లో హెచ్చుతగ్గులు వచ్చి అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి తీసుకెళ్తే ఐసీయూలో చేర్చారు. ఆ శబ్దమే కొన్ని రోజుల పాటు వృద్ధుడిని వెంటాడింది.

న్యూస్‌టుడే, సత్తెనపల్లి

వేడుక ఏదైనా డీజే ఉండాల్సిందే.. పెళ్లిళ్లు, జన్మదినాలు, చావులు, రాజకీయ పార్టీల సభలు, ర్యాలీలు, సినీ హీరోల వేడుకలు.. ఇలా ఏదైనా అన్నింటిలోనూ డీజే శబ్దాల మోత మోగుతోంది. మొన్నటివరకు ఎక్కడో నగరాల్లో పబ్‌లకు పరిమితమైన ఆ సంస్కృతి నేడు పల్లెలకు చేరింది. ఇప్పటికే వాయు కాలుష్యంతో అల్లాడిపోతున్న జనం శబ్ద కాలుష్యం బారిన పడి, ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల్ని ఉల్లంఘించే విధంగా డీజే శబ్దాలు ఉంటున్నా నియంత్రించే చర్యలు ఉండట్లేదు. ఈ విషయంలో ప్రభుత్వశాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

నిబంధనలు బేఖాతరు

శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రివెన్షన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సౌండ్ పొల్యూషన్ చట్టాన్ని అమలు చేస్తోంది. రాత్రి 10 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 6 గంటల వరకు అధిక శబ్దం చేసే డీజేలు, బాణసంచా కాల్చడంలాంటి వాటిపై నిషేధం ఉంది. అయితే ఎక్కడా ఇది అమలుకు నోచుకోవట్లేదు. రాత్రి 10 తరువాతే పెళ్లిళ్లు, జన్మదిన వేడుకలు, రాజకీయ పార్టీల ఊరేగింపుల్లో శబ్దాల మోత మోగుతోంది. చెవులకు చిల్లు పడేలా ఉంటోంది.



'హైదరాబాద్ నగరంలో ఊరేగింపులు, వేడుకలకు అధిక సంఖ్యలో డీజేలకు వాడుతున్నారు. ఫలితంగా శబ్ద కాలుష్యం పెరుగుతోంది. గుండె జబ్బుల బాధితులకు మరింత ముప్పు వాటిల్లుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో డీజేలను నిషేధిస్తూ అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.'

ముప్పు గుర్తిద్దాం..

❖ సాధారణంగా మానవుని చెవులు 120 నుంచి 130 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని భరించగలవు. 150 డెసిబుల్స్ వరకు శబ్దం వెళితే వినికిడి సమస్యలు వస్తాయి. కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంది. రక్తపోటు పెరుగుతుంది. డీజే బాక్సుల నుంచి వచ్చే వైబ్రేషన్స్ వల్ల శరీరంలో నాడీ వ్యవస్థ దెబ్బతిని మెదడుకు రక్తం సరఫరా తగ్గుతుంది. గుండెకు రక్తం అందించే నాళాలు మూసుకుపోయి గుండెకు రక్తం సరఫరా తగ్గి గుండెపోటు వచ్చే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. ❖ గర్భిణులు డీజే బాక్సుల నుంచి వెలువడే అధిక శబ్దం వింటే గర్భస్థ శిశువు నిద్రకు విఘాతం కలుగుతుంది. తద్వారా పిండం పెరుగుదల, శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. బాలింత, నవజాత శిశువు చెవులకు అధిక శబ్దం చేరితే వినికిడి సమస్యలతో పాటు శరీరంలోని అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. ఎందుకంటే ప్రసవం తరువాత తల్లి, బిడ్డలో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉంటుంది.




అనర్థాలెన్నో..

❖ డీజే లౌడ్‌స్పీకర్ల శబ్దంతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని గుంటూరు సమగ్రాసుపత్రి ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ సోమశేఖర్ చెప్పారు. ❖ 85 డెసిబుల్స్ శబ్దం దాటితే వినికిడి, గుండె సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. ❖ రక్తపోటు(బీపీ) పెరుగుతుంది. ❖ నిద్రలేమితోపాటు ఒత్తిడి పెరిగి మైగ్రేన్ సమస్యలు వస్తాయి. ❖ అలర్జీతోపాటు శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతాయి. ❖ తలనొప్పి, చికాకుతోపాటు నిద్రలేమి, అలసట ఏర్పడుతుంది. ❖ ఎక్కువకాలం అధిక శబ్దం వినడంతో గుండె జబ్బులు, చెవుడు రావచ్చు. ❖ మానసిక, శారీరక కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ❖ పిల్లల్లో కర్ణభేరిలో సూక్ష్మనాడులు దెబ్బతింటాయి. వృద్ధులకు వినికిడి శక్తి తగ్గిపోతుంది.

ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట వ్యవసాయం: ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తున్న రైతుల వివరాలను సేకరించి ఉర్వి యాప్‌లో నమోదు చేయాలని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర డిజిటల్ కో- ఆర్డినేటర్ వెంకటరామయ్య కోరారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేయటం ద్వారా వారు పండిస్తున్న పంటల వివరాలను సంబంధిత ఏజెన్సీలకు ఇవ్వడంతో మార్కెటింగ్ సదుపాయం లభిస్తుందన్నారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ఈ సంవత్సరం 39,113 ఎకరాల్లో 30 రకాల విత్తనాలు సాగు చేయటం ద్వారా పశువులకు మేతగాను, భూమిలో కలిపివేయటం ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చినట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రకృతి వ్యవసాయం చేసే ప్రతి రైతులను పీజీఎస్ గ్రూపులుగా ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా అడిషినల్ డీపీఎం ప్రేమ్‌రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామ సమైఖ్య సంఘం పరిధిలో ప్రకృతి వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి అందులో రైతులకు అవసరమైన కషాయాలు తయారు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. ప్రకృతి ఎన్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై విచారణ

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామంలో ఓర్సు శివయ్య అనుమానాస్పద మృతిపై విజయపురిసౌత్ ఎస్సై షేక్ మహమ్మద్ షఫీ మంగళవారం విచారణ చేపట్టారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతుందన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం విచారణ పూర్తవుతుందన్నారు. మృతుడి భార్యతోపాటు, చుట్టుపక్కల వారిని విచారిస్తున్నట్లు తెలిపారు. అయితే వివాహేతర సంబంధం నేపథ్యంలో శివయ్య హత్య జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

క్రీడలతో సమాజంలో గుర్తింపు

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం


సెపక్‌తక్రాలో తలపడుతున్న క్రీడాకారులు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం తెచ్చుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెన జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-19 బాల బాలికల సెపక్ తక్రా పోటీలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆటలపై మక్కువ పెంచుకున్నట్లు తెలిపారు. ఆంధ్రా విశ్వ విద్యాలయంలో వరుసగా మూడేళ్లపాటు ఛాంపియన్‌షిప్ సాధించినట్లు గుర్తు చేసుకున్నారు. స్నేహతత్వం, ఆరోగ్యకర పోటీతత్వం ఆటల ద్వారా పెంపొందుతాయన్నారు. అనంతరం వివిధ జిల్లాల క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. సర్పంచి అన్నపూర్ణమ్మ, నాయకులు బొర్రా వెంకటఅప్పారావు, కోమటినేని శ్రీనివాసరావు, మందడపు సాంబయ్య, గోపిదేశి రామారావు, అలపర్తి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన జట్లు

సెపక్ తక్రా పోటీలు వీక్షకుల కేరింతల నడుమ జరిగాయి. తొలిరోజు 16 జట్లు తలపడ్డాయి. బాలుర విభాగంలో కడప జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా జట్టు విజయం సాధించింది. గుంటూరు జట్టుపై నెల్లూరు, అనంతపురంపై ప్రకాశం, విజయనగరం జిల్లా జట్టుపై పశ్చిమ గోదావరి జట్టు జయకేతనం ఎగురవేసి సెమీఫైనల్‌లో అడుగు పెట్టాయి. బాలికల విభాగంలో నెల్లూరు జట్టుపై అనంత జట్టు, కడపపై కర్నూలు, గుంటూరు జట్టుపై పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు పట్టు సాధించి సెమీఫైనల్‌కు చేరాయి. అండర్-19 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, ఇంటర్ క్రీడల కార్యదర్శి ఎస్.సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం వద్దు

నకరికల్లు, న్యూస్‌టుడే: ప్రతి నెలా ఒకటో తేదీనే పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టరు అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన నకరికల్లు మండలం రూపెనగుంట గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా ఇబ్బంది లేకుండా పింఛన్ల పంపిణీ సాగుతోందన్నారు. ఎక్కడా అలసత్వం లేకుండా సొమ్ము అందించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పుల్లారావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


దీక్ష చేస్తున్న యువజన, విద్యార్థి సంఘాల నేతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: వామపక్ష యువజన, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు మంగళవారం ప్రారంభించారు. గాంధీ పార్కు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో యువజన, విద్యార్థి సంఘాల నేతలు దీక్షలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ.. ఎందరో ఆత్మబలిదానంతో విశాఖ ఉక్కు పరిశ్రమ వచ్చిందన్నారు. కేంద్రప్రభుత్వం ఆంధ్రుల హక్కుగా ఉన్న ఉక్కు పరిశ్రమ విక్రయించేందుకు కుట్రలు చేస్తుందన్నారు. పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేపడుతున్నామని చెబుతూ 4వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం ఏంటని నిలదీశారు. తొలగించిన కార్మికులు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. శిలార్; శివకుమారి, ఉప్పలపాటి రంగయ్య తదితరులు ఉన్నారు.

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న శివకుమారి

కొత్తలూరు,కనమర్లపూడి(శావల్యాపురం),న్యూస్‌టుడే : రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు, కనమర్లపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు గత ప్రభుత్వం మాదిరి కాకుండా రైతులకు అవసరమైన ఆయిల్ ఇంజిన్లు, తైవాన్ స్ప్రేయర్లు, లింకు పైపులు, వర్షానికి పంట ఉత్పత్తులు తడవకుండా ఉండటానికి అవసరమైన పట్టలు రాయితీపై సరఫరా చేయాలని అధికారులను కోరారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఎం.వెంకటేశ్వర్లు, ఏఈవో పూరేటి అశోక, సిబ్బంది స్రవంతి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పార్టీని నమ్ముకుంటే మోసం చేస్తారా?

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామ వైకాపా సర్పంచి సుంకర ముత్తయ్య సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో తెదేపాలో చేరారు. దీనిపై అదే గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు జెట్టి కటాక్షం తదితరులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. బాధితుడి వివరాల మేరకు.. గత పంచాయతీ ఎన్నికల్లో తెదేపా తరపున సర్పంచిగా పోటీ చేసి ఓడిపోయానని, అప్పట్లో మూడెకరాల భూమి అమ్ముకుని ఖర్చు చేసినట్లు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో తనను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా పార్టీని వీడలేదన్నారు. ప్రస్తుతం వైకాపా సర్పంచి ముత్తయ్య తన స్వలాభం కోసం తెదేపాలో చేరన్నారు. ఈ విషయం తమకు తెలియదని, 30 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న తనకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచిని తెదేపా నుంచి బహిష్కరించాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ పెట్రోల్ సీసాతో నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.


పెట్రోల్ సీసాతో నిరసన తెలుపుతున్న తెదేపా నాయకుడు కటాక్షం తదితరులు

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని వీరవట్నానికి చెందిన కేతరాజుపల్లి నాగేశ్వరరావు(85) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుమారుడు వేమలయ్య తన తండ్రి మృతదేహాన్ని రొంపిచర్ల భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సభ్యుల సహకారంతో అమ్మ నేత్ర అవయవ శరీరదానం ప్రోత్సాహక సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు అప్పగించారు. మృతుడి నేత్రాలు పెదకాకాని శంకర్ కంటి వైద్యశాలకు ఇచ్చారు. అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహక సంఘం జిల్లా కో- ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


నాగేశ్వరరావు (పాత చిత్రం)

రైలు ప్రయాణికుడి మృతి

దాచేపల్లి, న్యూస్‌టుడే: రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. పిట్టా రమణ (45) అనే వ్యక్తి తన భార్య, కుమారుడితో కలసి లింగంపల్లి నుంచి కాకినాడ పోర్టు వరకు టికెట్ తీసుకుని, సోమవారం [illegible] ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. తెల్లవారుజాము పొందుగుల స్టేషన్ దగ్గరకు చేరుకుంటున్న సమయంలో రమణ గుండెలో నొప్పి అంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆర్పీఎఫ్ పోలీసులు కుటుంబ సభ్యులు ఆర్పీఎఫ్‌కు సమాచారం అందించారు. రైలును ఆపి బాధితుడిని కిందకు దింపారు. అనంతరం 108 వాహనం సిబ్బంది పరీక్షించగా అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
[illegible]: లేయర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర
[illegible]

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

విద్యార్థుల రక్తదానం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. 120 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కేజే మోహన్‌రెడ్డి తెలిపారు. 24 ఏళ్లుగా జనవరి 26, అగస్టు 15, అక్టోబర్ 2వ తేదీల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం వైద్యశాల ప్రాంగణంలో చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తామన్నారు. 10 మందికి ఉచితంగా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తామని వివరించారు. పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పురపాలక సంఘం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు మరమ్మతు కారణంగా సక్రమంగా పనిచేయడం లేదు - **శ్రీనివాసరావు**

? పాఠశాల మైదానంలో నిర్మించిన నడకదారిలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు వెలగడం లేదు - **సుబ్బారావు**

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాను

- సుభాష్‌చంద్రబోస్, మున్సిపల్ కమిషనర్, వినుకొండ

–న్యూస్‌టుడే, వినుకొండ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు..
యోగాలో మెరికలు
చదువుతో పాటు రాణింపు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే:

లక్ష్య సాధనకు కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. ఒక వైపు చదువులో రాణిస్తూనే మరోవైపు యోగాలోనూ ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సూచనలు, శిక్షణలో మెలకువలు నేర్చుకుని ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొన్ని పతకాలు కైవసం చేసుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేందుకు నిత్యం సాధన చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ నియోజకవర్గ పోటీల్లో పలువురు విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. శంకరభారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాల, సంత గుడిపాడు కస్తూర్బా బాలికల విద్యాలయంలో చదువుతున్న బాల బాలికలు అండర్-17 విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలకు నియోజకవర్గం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. వారిపై కథనం.

మొదటి నుంచి ఆసక్తి



నరసరావుపేట మండలం లింగంగుంట్లకు చెందిన డి.భవాని శంకరభారతిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మొదటి నుంచి యోగా అంటే ఆసక్తి. విద్యార్థికి ఉన్న ఆసక్తిని గమనించిన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. అండర్-14 స్కూల్ గేమ్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన అండర్-17 స్కూల్ గేమ్స్ యోగా పోటీలలో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చూపి ఉమ్మడి జిల్లా జట్టుకు కూడా ఎంపికైంది. **డి.భవాని, లింగంగుంట్ల**

రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించాలి



నరసరావుపేట మండలం అల్లూరివారిపాలేనికి చెందిన పి.స్నేహాంజలి శంకరభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఇటీవల స్కూల్ గేమ్ అండర్-14 విభాగంలో యోగాలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. తాజాగా స్కూల్ గేమ్స్ అండర్-17 యోగా పోటీల్లో ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి జట్టుకు ఎంపికైంది. రానున్న కాలంలో అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడానికి నిత్యం సాధన చేస్తున్నానని చెబుతోంది. **-పి.స్నేహాంజలి, అల్లూరివారిపాలెం**

వ్యాయామ ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో..



రొంపిచర్ల మండలం తుంగపాడుకు చెందిన గురువర్ధని సంతగుడిపాడు కస్తూర్బాలో 7వ తరగతి చదువుతోంది. మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపింది. త్వరలో జరిగే అండర్-17జిల్లా స్థాయి పోటీలకు నియోజకవర్గం తరుపున ప్రాతినిధ్యం వహించనుంది. వ్యాయామ ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో నిత్యం సాధన చేస్తున్నట్లు తెలిపింది. **-ఎం.గురువర్ధని, తుంగపాడు**

జాతీయ స్థాయిలో రాణించాలన్నదే ధ్యేయం



నరసరావుపేట మండలం లింగంగుంట్లకు చెందిన ప్రవీణ్‌కుమార్ శంకరభారతిపురం హైస్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాడు. అండర్-17 నియోజకవర్గ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. గతంలో అండర్-14 విభాగంలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. రానున్న కాలంలో రాష్ట్ర పోటీలకు ఎంపిక కావాలని నిత్యం సాధన చేస్తున్నా. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలనేది నా కోరిక. **-ప్రవీణ్‌కుమార్, లింగంగుంట్ల**

వరద బాధితులకు సాయం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులకు ఎస్.ఎస్.ఐ.ఐ.టి. విద్యాసంస్థల తరపున అధినేత శ్రీనివాసరావు రూ.లక్ష సాయాన్ని స్థానిక ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరాస్వామికి మంగళవారం అందజేశారు. అన్ని విరాళాలు వచ్చిన తర్వాత మొత్తం సీఎంకు అందజేయనున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.


సాయం అందిస్తున్న శ్రీనివాసరావు

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

నాదెండ్ల: పంచాయతీల్లోని మురుగు కాలువల్లో పూడిక వ్యర్థాలు తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు పర్యవేక్షించాలని ఎంపీపీ రాణి సూచించారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, తహసీల్దారు వెంకట రమణ పాల్గొన్నారు.

మిద్దె తోటలపై మహిళల ఆసక్తి

నరసరావుపేట వ్యవసాయం: జిల్లాలో మహిళలు ప్రకృతి వ్యవసాయం చేయడమే కాకుండా మిద్దె తోటలు పెంపకంపై ఆసక్తి చూపుతున్నారని డీపీఎం అమలకుమారి అన్నారు. పట్టణంలోని కాకతీయ నగర్‌లో మిద్దె తోటల పెంపకంలో భాగంగా బాలానగర్ సీతాఫలం, దానిమ్మ, జామ, ద్రాక్ష, థాయిలాండ్ మ్యాంగో, పనస, ఎరుపు అరటి, యాపిల్ బేర్, నేరేడు తదితర రకాలైన పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న డీపీఎం మాట్లాడుతూ చదువుకున్న మహిళలు, పట్టణంలో నివాసం ఉంటున్న వారు పెరటి తోటలు పెంచే అంత స్థలం లేకపోవటంతో ఎక్కువగా మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలు వంట ఇంటికి కావలిసిన ఆకుకూరలను, కూరగాయలను, మిద్దె తోటలు, పెరటి తోటలు వేసి ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించి ఆరోగ్యకరమైన ఆహారం తింటున్నారన్నారు. మహిళలను గ్రూపుగా చేసి మొక్కలు పెంచటానికి సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పెరటి, మిద్దె తోట మహిళలు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లియో గ్లోబల్ సర్వీసెస్ ప్రతినిధులు అమెరికా, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల్లో విద్యకు అవకాశాలు, వీసా, తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.

ఒంటరి మహిళలకు సాయం


మహిళలకు సాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట పట్టణం: వృద్ధుల దినోత్సవ సందర్భంగా చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో 110 మంది ఒంటరి మహిళలకు మంగళవారం రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసర వస్తువులు, పంపిణీ చేశారు. ఒయాసిస్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో సాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రూ.10వేల విలువ చేసే నిత్యావసర సరకులు అందజేశారు. **రొంపిచర్ల:** వి.రెడ్డిపాలెం పీహెచ్‌సీలో వృద్ధులకు అవగాహన కల్పించారు.


నరసరావుపేట: పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు


లింగంగుంట్లలో అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి


చిలకలూరిపేటలో..


రొంపిచర్ల: నగదు అందజేస్తున్న మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి

ఠంచనుగా పింఛను అందజేత
తెల్లవారుజాము నుంచే ప్రారంభం

నరసరావుపేటసెంట్రల్, నూజండ్ల, చిలకలూరిపేట పట్టణం, రొంపిచర్ల, చిలకలూరిపేట గ్రామీణ,శావల్యాపురం,న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అర్హులకు పింఛను అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. పట్టణంలోని ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. నూజండ్ల మండలంలో 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. చిలకలూరి పురపాలికలో మొత్తం 11,108 అర్హులు ఉండగా 10,894 మందికి మొదటి రోజు అందజేయడంతో 98.07గా నమోదైందని కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. రొంపిచర్ల మండల ప్రత్యేక అధికారి, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి సూర్య ప్రకాశ్‌రెడ్డి రొంపిచర్ల సచివాలయంలో పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. చిలకలూరిపేట మండలంలో మొదటిరోజు 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. శావల్యాపురం మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 97.55 పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు.

పోలీసు క్వార్టర్స్ వినియోగంలోకి తీసుకువస్తాం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లాలో నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను వినియోగంలోకి తీసుకురావటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సంబంధిత విభాగ డీఎస్పీ జీఎం.గాంధీ అన్నారు. రొంపిచర్లలో నిరుపయోగంగా మారిన పోలీసు క్వార్టర్స్‌ను మంగళవారం ఆయన, పోలీసుశాఖ ఈఈ దుర్గాప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఎస్సై అశోక్, ఏఎస్సై మణివర్మ తదితరులు ఉన్నారు.


పోలీసు క్వార్టర్స్ పరిశీలిస్తున్న డీఎస్పీ గాంధీ, ఎస్సై అశోక్

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

రొంపిచర్ల, నూజండ్ల, యడ్లపాడు, న్యూస్‌టుడే: పంటల సాగులో అన్నదాతలు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించటంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి శివలలిత అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం, చాకలికుంట తండా గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడం ద్వారానే రైతులకు లాభాలు ఎక్కువగా ఉంటాయని వ్యవసాయాధికారి సుగుణా బేగం ఆధ్వర్యంలో నూజండ్ల మండలంలోని కంభంపాడు, పమిడిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ అన్నారు. ముడలంలోని సొలస, లింగారావుపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శివలలిత

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పూజలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం జనసేన నాయకులు కోటప్ప కొండ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా ఓం నమో నారాయణ మంత్ర పఠనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాదు, పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ

ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి ఆర్థిక సాయం

రొంపిచర్ల: వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో దారి దీపం అనే పథకం కింద ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ప్రిన్సిపల్ బి.రవినాయక్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన రుద్రపాటి శ్రీనిధికి ఉపాధ్యాయులు, పాఠశాల పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు, వారి మిత్రులు రూ.50వేలు అందించామని తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

చిలకలూరిపేట గ్రామీణ : మండలంలోని బొప్పూడి పరిధిలోని పొలాల్లో 8 మంది జూదరులను గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ మంగళవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4వేలు స్వాధీనం చేసుకున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.300 జరిమానా విధించినట్లు తెలిపారు.

ముగిసిన మండల స్థాయి చెకుముకి పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం,న్యూస్‌టుడే : శావల్యాపురం మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు మంగళవారం శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించినట్లు పల్నాడు జిల్లా జన విజ్ఞాన వేదిక కోశాధికారి సంద్రపాటి చలపతిరావు తెలిపారు. పోటీల్లో మొత్తం మండలంలోని నాలుగు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన పి.జ్యోతిర్మయి, ప్రసన్న,ఎన్. భవ్యశ్రీ ప్రథమ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. పోట్లూరు పాఠశాలకు చెందిన రూపశ్రీ, అక్షయ్‌కుమార్, యమున ద్వితీయ స్థానం సాధించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో మద్దిగుంట సాంబశివరావు చేతుల మీదగా బహుమతులు అందచేశారు.

నూజండ్ల, న్యూస్‌టుడే: పోటీతత్వం అలవర్చుకోవడం ద్వారా విజయాలు సాధించవచ్చని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. నూజండ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు మొదటి స్థానంలో విజయం సాధించగా నూజండ్ల జడ్పీ రెండవ స్థానం, ఉప్పలపాడు గురుకుల విద్యార్థులు తృతీయ స్థానంలో విజయం సాధించారు. విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

యడ్లపాడు, న్యూస్‌టుడే: నారాయణ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముఖి సంబరాలు నిర్వహించారు. పోటీల్లో నారాయణ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు విజేతలుగా ఎంపికయ్యారు. వీరిని జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సాతులూరు (నాదెండ్ల), న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి సైన్స్ మండల స్థాయి ప్రతిభ పరీక్షల్లో సాతులూరు ఈతరం విద్యార్థులు విజేతలుగా నిలిచారు. షేక్ సుహానా 8వ తరగతి, లోహిత 9వ తరగతి, భువన ప్రథమ స్థానం సాధించారు.

వక్తృత్వ పోటీల్లో కస్తూర్బా విద్యార్థి ప్రతిభ


హేమలతకు బహుమతి అందిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న హేమలత ఇటీవల నిర్వహించిన స్వర్ణాంధ్ర -2024 పోటీలకు సంబంధించి నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిందని ప్రిన్సిపల్ బాలశౌరి మంగళవారం తెలిపారు. విద్యార్థి హేమలతకు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు బహుమతి అందజేశారు.

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 అంశంపై జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట శంకరభారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీలలో బొప్పూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.మౌనిక ప్రథమ స్థానంలో నిలిచింది. హెచ్ఎం బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బహుమతి అందజేసి అభినందించారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్టులో గుడ్ షెపర్డ్ విద్యార్థులు ఎంపిక


జిల్లా జట్టులో స్థానం సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు తమ పాఠశాల విద్యార్థులు 9 మంది ఎంపికైనట్లు గుడ్ షెపర్డ్ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ సునీత తెలిపారు. గతనెల 28న చిలుకలూరిపేటలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో అండర్ 14, 17, 19లో తమ విద్యార్థులు 6గురు ఎంపికయ్యారని, 30న నరసరావుపేటలో నిర్వహించిన ఎంపికలో ముగ్గురు అర్హత సాధించారని పేర్కొన్నారు. అండర్ 14లో బాలుర విభాగంలో అఖిల్, మనోహర్, పవన్ అర్హత సాధించగా బాలికల విభాగంలో పవిత్ర, జోషిత, అండర్ 17లో హాసిని, అండర్ 19లో భార్గవి, తేజస్విని ప్రతిభ కనబరచి జిల్లా జట్టులో చోటు సాధించారని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో నిర్మల విద్యార్థికి గోల్డ్‌మెడల్

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో అండర్ 17 విభాగంలో నిర్మల పాఠశాల విద్యార్థి బి.హర్ష గోల్డ్‌మెడల్ సాధించాడని కరస్పాండెంట్ సిసిలి తెలిపారు. సెప్టెంబర్ 30న పెనుమాకలో జరిగిన పోటీల్లో అండర్ 17 విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో హర్ష గోల్డ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నెలలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత సాధించాడన్నారు. మగళవారం పాఠశాల్లో అభినందన సభ ఏర్పాటు చేశారు.


విద్యార్థి హర్షను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు పసుమర్రు విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు

చిలకలూరిపేట గ్రామీణ : రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని పసుమర్రు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-19 బాలుర విభాగంలో షేక్ రషీద్, బాలికల విభాగంలో షేక్ సుమయ, షేక్ రేష్మలు ఎంపికైనట్లు హెచ్ఎం వై.హనుమంతరావు మంగళవారం తెలిపారు. ఎంపికైన ముగ్గురు విద్యార్థులు త్వరలో ప.గో.జిల్లా పెదవేగిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

అవీ ఇవీ

కనీస వేతనం ఇవ్వాలి

వినుకొండ, న్యూస్‌టుడే: పురపాలక సంఘ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. కేంద్రం ఆమోదించిన వేతనాలు నైపుణ్యం ఉన్న కార్మికులకు రూ.26,910, క్లరికల్ సిబ్బందికి రూ.24,800, సాధారణ కార్మికులకు రూ.22,600 వంతున అమలు చయాలని కోరారు. విపత్కర పరిస్థితులలో సైతం పని చేసే మున్సిపల్ సిబ్బందికి తగిన న్యాయం చేయాలని సూచించారు. లేని పక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు.

చేపలు, మాంసం దుకాణాల తనిఖీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేటలో గడియార స్తంభం సమీపంలోని చేపలు, మాంసం దుకాణాలను పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్‌కే రఫానీ, కమిషనర్ శ్రీగిరిబాబు మంగళవారం పరిశీలించారు. వ్యాపారస్థులతో ఛైర్మన్ మాట్లాడుతూ చేపల మార్కెట్ నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని వివరించారు.

బాక్సింగ్ కిట్ అందజేత

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా బాక్సింగ్ టీమ్ అండర్-17 (60 కిలోల) విభాగంలో మండలంలోని కాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వక్కలగడ్డ కాత్యాయిని ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు గోవిందరాజులు మంగళవారం తెలిపారు. విద్యార్థికి పాఠశాల తరపున బాక్సింగ్ కిట్ అందజేసి అభినందనలు తెలిపామని చెప్పారు.

శరన్నవరాత్రులకు సిద్ధమైన అమ్మవారి దేవాలయాలు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రులకు పట్టణంలోని పలు దేవాలయాలు సిద్ధమయ్యాయి. స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని శ్రీ శారదాంబ దేవాలయంలో ఒక రోజు ముందుగానే 2న అమ్మవారు శయన అలంకరణతో ప్రారంభమవుతున్నాయి. 3 నుంచి 12 వరకు వరుసగా మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, అన్నపూర్ణ, ధనలక్ష్మి, సరస్వతి, దుర్గ, చండి, రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులు సభ్యులు కావాలి

వినుకొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్‌లో చేరి సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలని గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు కోరారు. కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు సేవాథృక్పదం అలవరచుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యుత్తు మరమ్మతుల కారణంగా చిలకలూరిపేట పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక పండరీపురం, ఎన్ఆర్‌టీ సెంటర్, సుగాలీకాలనీ, చెరువు రోడ్డు, బ్యాంక్ కాలనీ పరిసర ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీట్ ర్యాంకర్లకు సన్మానం

వినుకొండ, న్యూస్‌టుడే: నీట్ ప్రవేశ పరీక్షలలో ప్రతిభ చాటి మెడికల్ సీట్లు సాధించిన ఎ.బాబి ఆంటోని, ఎస్టీ యాస్మిన్‌లతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. విశ్వసాయి జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీ స్వామిశ్రీనివాసరావు విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు.


ర్యాంకర్లను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ పావని తదితరులు

ఎండకు ఎండి.. వానకు తడిచి

గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లక్షల రూపాయల 108 వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టిపోతున్నాయి. గత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత వాటికి మరమ్మతులు చేయించకుండా కొత్త వాహనాలు కొనుగోలు చేసింది. దీంతో ఉన్న వాటిని మూలన పడేశారు. మార్కెట్ యార్డులో రెండు 108 వాహనాలను నిరుపయోగంగా వదిలేయడంతో టైర్లు, ఇతర విలువైన వస్తువులు దొంగలు అపహరించుకెళ్లారు. అధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



-న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

ఉపాధి కల్పన లక్ష్యంగా కళాశాల నిర్వహణ

నరసరావుపేట అర్బన్: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచే విధంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కృష్ణవేణి విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో మంగళవారం స్వాగత దినోత్సవం నిర్వహించారు. విద్య, క్రీడాంశాల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. సినీ నటుడు స్నిగ్ధ, అను, గాయకుడు ఉదయ్‌ల కార్యక్రమాలు అలరించాయి.


విద్యార్థినుల నృత్యప్రదర్శన

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

గాంధీ మార్గం అనుసరణీయం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గాంధీ మార్గం అనుసరణీయమని వక్తలు అన్నారు. స్థానిక హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలల్లో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాసంస్థ బాధ్యుడు బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి బంగారు ముక్కుపుడక సమర్పణ

దాచేపల్లి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రులు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ముక్కుపుడక సమర్పించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో కేసానుపల్లి రోడ్డు సమీపంలోని గ్రామ దేవత అంకమ్మతల్లికి అర్చకులు పవన్ కుమార్ శర్మ, రాధిక దంపతులు రూ.50,000 విలువగల బంగారు ముక్కుపుడక, పట్టు వస్త్రాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.


ముక్కుపుడక, పట్టువస్త్రాలు అందజేస్తున్న అర్చకులు పవన్ కుమార్ శర్మ దంపతులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? పెదకూరపాడు సామాజిక ఆరోగ్యకేంద్రం దారి పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. చెత్త కుళ్లి దుర్వాసన వస్తోంది.
- స్థానికుడు, పెదకూరపాడు

✔ సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం. **- శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ,** - న్యూస్‌టుడే, పెదకూరపాడు

? గురజాల - మాడుగుల రహదారికి ఇరువైపులా కంపచెట్లు కమ్ముకున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- వెంకటేశ్వర్లు, గురజాల

✔ ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలో తొలగిస్తాం
- యూసుఫ్, ఆర్అండ్‌బి ఏఈ - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? ఇరికేపల్లి మండల పరిషత్ పాఠశాల వద్ద మురుగు కాలువలో పూడిక తొలగించాలి. **- శివరెడ్డి, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తొలగిస్తాం.
- అనిత, కార్యదర్శి,- న్యూస్‌టుడే, దాచేపల్లి

ప్రగతి బాటన పల్లెలు

ఉపాధి నిధులు మంజూరు

సత్తెనపల్లి గ్రామీణ, పెదకూరపాడు, న్యూస్‌టుడే


ఇలాంటి కష్టాలకు ఇక చెల్లు

పల్లె తల్లి వంటిది.. పల్లెను చూసి పరవశించండి.. అన్నారొక కవి. పల్లెసీమల సహజ అందం ఎదుట మరేది సాటిరాదు. . అనే నానుడి ఉంది.. ఆ మాటలకు భిన్నమైన పరిస్థితులను గత ఐదేళ్ల పాలనలో గ్రామీణులు ఎదుర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులను గత పాలనలో పక్కదారి పట్టించారు. ఫలితంగా గ్రామాలు అభివృద్ధికి దూరమై నిస్తేజంగా మారాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెల్లో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది.

సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో 178 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి పంచాయతీలో ఇటీవల గ్రామసభలు జరిగాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా చర్చించి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించారు. గతంలో కేవలం గ్రామ సచివాలయాల వంటి నిర్మాణాలకే నరేగా నిధులు కేటాయించడాన్ని తప్పుపట్టారు. నివాస ప్రాంతాల్లో సరైన రహదారులు లేక చిరుజల్లులకే బురదమయమవుతున్నాయి. మురుగు కాలువల్లేక నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. పొరుగు ఊరికి వెళ్లాలన్నా గోతులమయమైన రోడ్లతో గ్రామీణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటికి పరిష్కారంతోపాటు స్థానికంగా ఉపాధి పనులు కల్పించే దిశగా ఎట్టకేలకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ప్రాధాన్యత క్రమంలో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, పాఠశాలల ప్రహరీలు నిర్మించేందుకు, బీటీ రహదారులు రూపొందించేందుకు యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి రూ.7.79 కోట్లు, పెదకూరపాడుకు రూ.10.97 కోట్లు మంజూరయ్యాయి. సత్తెనపల్లికి అదనంగా మరో 17 పనులకు రూ.2.46 కోట్ల నిధులు మంజూరు కానున్నాయి.

పనులు వేగవంతం

గ్రామసభల ద్వారా మంజూరైన రూ.7.79 కోట్లతో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేస్తాం. అదనంగా రూ.2.46 కోట్లు ప్రతిపాదించాం. ఇప్పటికే వర్క్ ఆర్డర్ల జారీ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. అనేకచోట్ల పనులకు సంబంధించి శంకుస్థాపనలు జరిగాయి. పాఠశాలల వద్ద స్థలాల హద్దులు గుర్తించి ప్రహరీ పనులు చేపడుతున్నాం. **- శేఖర్ బాబు, డీఈఈ, పీఆర్ఐ శాఖ, సత్తెనపల్లి**

అగ్నిమాపక కేంద్రం అవుట్‌పోస్టు పునఃప్రారంభం


ప్రారంభిస్తున్న జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్, తదితరులు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరులో అగ్నిమాపక కేంద్రం అవుట్ పోస్టును మంగళవారం జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అగ్నిమాపక సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అయిదేళ్లపాటు కేంద్రం నిర్వహణను ఎంఎపీ టెక్నాలజీస్ సంస్థ నిర్వహిస్తుందన్నారు. గత ఏజెన్సీ ప్రతి నిధుల నిర్వహణ లేకపోవటంతో అవుట్ పోస్టు ఆరునెలలుగా మూతపడిందన్నారు. క్రోసూరు, అచ్చంపేట మండలాలు పూర్తిగాను పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ మండలాలలో కొన్ని గ్రామాల వారికి అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి అగ్నిమాక కేంద్రం అధికారి సుబ్బారావు, సర్వీస్ ప్రొవైడర్ ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టు సీఅండ్‌బీ ఏఈఈగా హిమబిందు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా బి.హిమబిందు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలో క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా విధులు నిర్వహించి సాగర్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఏఈఈగా పనిచేసిన కె.వి.కోటేశ్వరరావు మాచర్ల డిజైన్స్‌కు బదిలీ అయ్యారు. మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈగా వెంకటసుబ్బయ్య, సాగర్ ప్రాజెక్టు గేట్స్ ఏఈఈగా అనితశ్రీ బాధ్యతలు చేపట్టారు. వాటర్ సప్లయి ఏఈఈగా పనిచేసిన లక్ష్మీనారాయణ దుగ్గిరాలకు, మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈ యుగంధర్ వినుకొండకు, సాగర్ ప్రాజెక్టు గేట్స్ ఏఈఈ బాబూమియనీ నెల్లూరులోని సోమశిలకు బదిలీ అయ్యారు.

'ఇష్టం లేకపోతే వేరేచోటుకు వెళ్లు'

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై ఎమ్మెల్యే ఆగ్రహం

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: 'ప్రజలను ఎన్ని నెలలు ఇబ్బంది పెడతారు.. ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకపోతే వేరే చోటుకు వెళ్లు.. బాధ్యతతో పని చేసే వారొస్తారు..' అంటూ గ్రామీణ నీటి సరఫరాశాఖ ఏఈ శ్రీనివాసరావుపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదమక్కెనలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. పెదమక్కెనలో జల్‌జీవన్ మిషన్ కింద సిమెంటు రోడ్డును ఇష్టానుసారంగా తవ్వి పైపులు అమర్చారు. ఏడాది గడుస్తున్నా తవ్విన రోడ్డును పూర్తిస్థాయిలో పూడ్చలేదు. వాహనాల రాకపోకలు, పాదచారులు కనీసం నడవాలన్నా ఇబ్బందిగా మారిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. మరమ్మతులు చేయాలని ఎన్నిమార్లు చెప్పినా తాత్సారం చేస్తున్నారని తెలుగురైతు నాయకుడు శ్రీనివాసరావు, సాంబయ్య వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ 'ఈరోజు రోడ్డు పనులు పెట్టి ఊరుకుంటే ఎలా.. ఇలాగైతే కుదరదు.. తవ్విన గుంతలను ఎప్పుడు పూడ్చుతారో చెప్పండి..' అంటూ నిలదీశారు.


నవ దుర్గలు..

ముందస్తు దసరా వేడుకలను స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో మంగళవారం విద్యార్థులు నిర్వహించారు. ఈమేరకు నవరాత్రుల విశిష్టతను తెలుపుతూ అమ్మవారి రూపాలను ధరించి అలరించారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఏర్పాటు చేసి పూజించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హనుమంతరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.- **న్యూస్‌టుడే, మాచర్ల (కారంపూడి)**

ప్రభుత్వ ఖాజీ నియామకం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన షేక్ మౌలానా అబ్దుల్ కరీంను పిడుగురాళ్ల పట్టణం, మండల ప్రభుత్వ ఖాజీగా నియమించారు. నియామక ఉత్తర్వును మంగళవారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు అందుబాటులో ఉంటూ సహకారం అందించాలని సూచించారు. మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలీ, షేక్ సైదా, పరీద్‌మేస్త్రి, వాచర్ బుడే, డి.ఖాశీంసైదా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు స్వాధీనం

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని తాడువాయి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. రెండు టిప్పర్లపై కేసు నమోదు చేసి, వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఉప సర్పంచి పదవికి రాజీనామా

బెల్లంకొండ, న్యూస్‌టుడే: బెల్లంకొండ పంచాయతీ ఉప సర్పంచి షేక్ మహబూబ్ సుభాని తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్యం కారణాలతో రాజీనామా చేసినట్లు తెలిపారు.

పండగలా పింఛన్ల పంపిణీ


మహిళకు నగదు ఇస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి


పిడుగురాళ్ల: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వం సంయమనం పాటిస్తుంటే, ప్రతిపక్షాలు మరోలా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో పలు వార్డులకు చెందిన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా కూడా వైకాపా శ్రేణులపై దాడులు చేయలేదన్నారు. మంగళవారం తురకపాలెంలో మాజీ సర్పంచి, తెదేపా నాయకుడిపై వైకాపా వాళ్లు దాడి చేశారు. మొన్న రేగులగడ్డలో కానిస్టేబుల్‌పైనా దాడికి తెగబడ్డారన్నారు. ఇకనైనా తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

సత్తెనపల్లి గ్రామీణ: పెదమక్కెనలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందించి ప్రతినెలా సక్రమంగా నగదు అందుతుందా అని ఆరా తీశారు. దివ్యాంగుల పింఛను రూ.6 వేలు అందుకున్న డి.సమాధానం అనే లబ్ధిదారురాలు ఈల వేసి కృతజ్ఞతలు తెలిపింది. అనంతరం రూ. 25 లక్షలతో చేపట్టనున్న ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు, బీసీ కాలనీలో సిమెంటు రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు.


సత్తెనపల్లి గ్రామీణ: పింఛను అందుకుని ఈల వేస్తున్న లబ్ధిదారురాలు

గురజాల గ్రామీణ: తెదేపా ప్రభుత్వంతోనే అవ్వాతాతలకు ఆనందం కలుగుతుందని యరపతినేని నిఖిల్ అన్నారు. మండలంలోని పులిపాడు, పల్లెగుంత గ్రామాల్లో మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణతో కలిసి ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పింఛన్లు పంపిణీ చేశారు.

కంభంపాడు (పెదకూరపాడు): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందని, పింఛన్ల పంపిణీలో భాగంగా గ్రామాల్లో తిరుగుతున్నపుడు అవ్వాతాతల కళ్లలో ఆనందం చూస్తున్నానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. మంగళవారం కంభంపాడులో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు.


కంభంపాడులో ఎమ్మెల్యే ప్రవీణ్ తదితరులు

కారంపూడి, న్యూస్‌టుడే: మండలంలోని పేటసన్నెగండ్లలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఒకటో తేదీనే అందరికీ పింఛను అందిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు కారంపూడి ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలను ప్రారంభించారు. వాసవీ క్లబ్ నేతృత్వంలో తయారు చేసిన విత్తన బంతులను ఆయన పరిశీలించారు.

మూడేళ్లుగా అంతే..


ఆగిన సచివాలయ భవన నిర్మాణం

మండలంలోని మాడుగుల గ్రామంలో సచివాలయ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం సుమారు రూ.80 లక్షలు మంజూరు చేసింది. శ్లాబు దశకు వచ్చిన తర్వాత బిల్లుల చెల్లింపులు ఆగడంతో నిర్మాణం ఆపేశారు. ప్రస్తుతం ముళ్లపొదలు, కంపచెట్లు మొలిచి నిర్మాణం దెబ్బతింటోంది.- **న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ**

లింగాకర్ష బుట్టలు ఏర్పాటు చేయాలి

రెడ్డిగూడెం, బ్రాహ్మణపల్లి(రాజుపాలెం): పత్తిలో గులాబి రంగు రెక్కల పురుగు ఉద్ధృతి తెలుసుకునేందుకు లింగాకర్ష బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులతో కలసి ఆయన మంగళవారం రెడ్డిగూడెం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో క్షేత్ర పర్యటన చేసి పత్తి, వరి పైర్లను పరిశీలించారు.

దాచేపల్లి: జీవన ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి పాపకుమారి సూచించారు. మంగళవారం పొందుగల, రామాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి, కంది, వరి పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు.

గురజాల గ్రామీణ: తక్కువ పెట్టుబడితో మేలైన దిగుబడి వచ్చేలా రైతులను సమాయత్తం చేస్తున్నామని వ్యవసాయాధికారి సంధ్యారాణి తెలిపారు. గంగవరం, పులిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పిడుగురాళ్ల: ఆయిల్ ఫాం సాగుపై ఉత్సాహం ఉన్న రైతులకు మొక్కల నుంచి మార్కెట్ వరకు అన్నీ తామే చూసుకుంటామని వాల్యూ ఆయిల్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటరు నవీన్ చెప్పారు. మంగళవారం పెదఅగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని మాదల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటారు. గత నెల 28 నుంచి 30 వరకు వినుకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు అంకమ్మరావు, నాగరాజు, శ్రావ్య రాణించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారిని ప్రధానోపాధ్యాయుడు రమేష్, విద్యా కమిటీ ఛైర్మన్ సాంబశివరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చెకుముకిలో ప్రథమం

దుర్గి, : మాచర్ల ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంగళవారం జరిగిన చెకుముకి పోటీల్లో ఓబులేశునపల్లె కోటసైదయ్య జడ్పీపాఠశాల విద్యార్థులు జి.భవ్యశ్రీ, సిహెచ్ నవ్య, జి.భూపతి నాగమల్లేశ్వర్ ప్రథమ స్థానంలో నిలిచారు. వారిని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందించారు.

జడ్పీ విద్యార్థుల ప్రతిభ

రాజుపాలెం, న్యూస్‌టుడే: రాజుపాలెంలో జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ఆకులగణపవరం ఎంపీఆర్‌పే జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో-2 నరసింహారావు తెలిపారు. హాసిని, శృతి, సాయిజస్వంత్ ప్రథమ స్థానం, విజయ్‌కుమార్, ప్రవీణ్, మహేంద్రరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు.

సవరణ

ది. 01-10-2024న శ్రీ నల్లపనేని లీలాశంకర్, S/o మల్లిఖార్జునరావు, R/o గోర్లవారిపాలెం గ్రామం, గుంటూరు రూరల్ (మం) వారి "డాక్యుమెంట్లు పోయినవి" ఇచ్చిన ప్రకటనలో లింకు డాక్యుమెంటు నెంబరు తప్పుగా ప్రచురించబడినది. దీనిని లింక్ డాక్యుమెంటు నెం: 3453/1997, తేది. 30-12-1997గా చదువుకొనగలరు.
ఇట్లు: C.నరేంద్రబాబు, M.A, B.L. అడ్వకేట్, గుంటూరు.

ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.25 వేలు నగదు చెక్కును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు స్థానిక రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాల, వాసవి కన్యకాపరమేశ్వరి జూనియర్ కళాశాల బాధ్యులు మంగళవారం అందజేశారు. విద్యా సంస్థల బాధ్యులు సుబ్బరాయుడు, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ కర్ణ బాధ్యతల స్వీకరణ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సీఐగా కె.కర్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కె.కర్ణ బాపట్ల జిల్లా చీరాలలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసే సీఐ సూర్యనారాయణ నెల్లూరు జిల్లా వెంకటగిరికి బదిలీ అయ్యారు.

'బ్రాహ్మణుల భద్రత.. ప్రభుత్వ బాధ్యత'

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణతో లోక కల్యాణం కోసం పని చేసే బ్రాహ్మణుల భద్రత.. రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని తాలుకా బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడికొండ మండలం పొన్నెకల్లు కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుడిపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అర్చకుల రక్షణకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ లాంటి చట్టం అమలు చేయాలని కోరారు.

వ్యక్తిగత కక్షలతో ఘర్షణ

బెల్లంకొండ, న్యూస్‌టుడే: వ్యక్తిగత కక్షలతో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డ ఘటన ఎమ్మాజీగూడెంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. ఎమ్మాజీగూడెం గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు రామకోటికి చెందిన కుక్క ఇంట్లో తరచూ అరుస్తుండటంతో కుటుంబ సభ్యులు గట్టిగా మందలించారు. ఇంటి పక్కన మరో వర్గానికి చెందిన వారు తమనే మందలిస్తున్నారని భావించి, వాదనకు దిగారు. ఈ వాదన ఇరువర్గాల ఘర్షణకు దారితీసింది. దీంతో రామకోటి భార్య లక్ష్మి, దుర్గ గాయపడ్డారు. మరో వర్గానికి చెందిన నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఎస్సై రాజా మాట్లాడుతూ వ్యక్తిగత కక్షలతో గొడవ పడ్డారని, ఇరువర్గాల ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్ష

గురజాల, న్యూస్‌టుడే: చెక్‌బౌన్స్ కేసులో నిందితుడిగా ప్రసాదరావుకు 6 నెలల జైలు శిక్ష, రూ.7,60,000 జరిమానా విధిస్తూ 1వ అదనపు సివిల్ జడ్జి కె.వి.సత్యన్నారాయణ మంగళవారం తీర్పునిచ్చారు. టి.శ్రీనివాసరావు అనే వ్యక్తికి చిట్లూరి ప్రసాదరావు రూ.5 లక్షల విలువైన చెక్కులు 2019, జనవరి 4న ఇచ్చారు. వీటిని బ్యాంకులో వేయగా డబ్బు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయి. శ్రీనివాసరావు కోర్టును ఆశ్రయించగా తీర్పు ఇచ్చినట్లు న్యాయవాది కోటేశ్వరరావు తెలిపారు.

నేరాల నియంత్రణకు పల్లె నిద్ర

దాచేపల్లి, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు పోలీసులు పల్లె నిద్రలు చేస్తున్నారని దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు అన్నారు. సోమవారం రాత్రి గామాలపాడులో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎవరూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దన్నారు. ఎస్సైలు శివనాగరాజు, పాపారావు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ దీక్షకు సంఘీభావం


దుర్గిలో దీపాలు వెలిగిస్తూ..

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు బొర్రా వెంకటఅప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గీతామందిరంలో ఓం నమో నారాయణాయ మంత్రాన్ని పఠించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు.

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం వ్యవహారంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఆ దీక్షకు మద్దతుగా పట్టణంలోని శివాలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సామూహిక దీపారాధన నిర్వహించారు. నాయకులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. **దుర్గి:** మండలంలోని పలు ఆలయాల్లో కూటమి సభ్యులు దీపాలు వెలిగించారు. పవన్‌కల్యాణ్ దీక్షకు సంఘీభావం తెలిపారు.


పిడుగురాళ్లలో..


సత్తెనపల్లిలో పూజలు

ఇద్దరు బాలురు అరెస్టు

పాటిబండ్ల(పెదకూరపాడు), న్యూస్‌టుడే: ప్రార్థనా మందిరంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకుని గుంటూరు కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. ఆదివారం పాటిబండ్ల మసీదులో దొంగతనం జరగ్గా.. మత పెద్దలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. నిందితులు బాలురు కావడంతో విజయవాడ జువెనల్ హోమ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించినట్లు తెలిపారు.

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విద్య, సిబ్బంది

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని సీహెచ్‌సీ వైద్యాధికారి విద్య అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆసుపత్రిలో వయోవృద్ధులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల (విజయపురిసౌత్): మలిదశలో వృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌సీడీ వైద్యాధికారి ఎం.వంశీ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లపైబడిన వారు తగిన వ్యాయామం చేస్తూ ఆహార సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ కె.పి.చారి, వైద్యులు జయప్రకాశ్, దినేశ్వరరావు, మరియసాగర్‌రాణి, రేవతి, మురళి, వివేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సంబరాలతో శాస్త్రీయ దృక్పథం

రెంటచింతల, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడానికి జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

వీఆర్వో అదృశ్యం

ముప్పాళ్ల : గ్రామ రెవెన్యూ అధికారి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు. పలుదేవర్లపాడుకు చెందిన సత్తెనపల్లి మల్లికార్జునరావు ఐదేళ్లుగా నార్నెపాడు వీఆర్వోగా పనిచేస్తున్నారు. సోమవారం విధులకు హాజరయ్యేందుకు ఇంటివద్ద నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. చరవాణి ఇంట్లో పెట్టి వెళ్లడంతో అనుమానం కలిగి కుటుంబ సభ్యులు వెతికారు. వీఆర్వో తల్లి నాగేంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వాసవీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

మాచర్ల (కారంపూడి) : వాసవీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో సభ్యులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపకుడు చంద్రశేఖరగుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ పట్టణ అధ్యక్షుడు చెన్నకేశవరావు మాట్లాడుతూ 2 లక్షల మంది సభ్యులతో ఏటా రూ.50 కోట్ల నిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నరసింహారావు, రాజ్‌కుమార్, వెంకటనాగేశ్వరరావు పాల్గొన్నారు.